
సాక్షి
బాపట్ల
ఆదివారం । 24 । మార్చి । 2024




కల్యాణ మహోత్సవం

పెదపులివర్రు(భట్టిప్రోలు): పెదపులివర్రులో కొలువైన భూ–నీళా సమేత వరదరాజ స్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా శనివారం రాత్రి బలిహరణ నిర్వహించారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్:నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం శనివారం 513.60 అడుగుల వద్ద ఉంది. ఎస్ఎల్‌బీసీకి 450 క్యూసెక్కులు విడుదలవుతోంది.



న్యూస్‌రీల్

మొసలిని పట్టుకున్న ఫారెస్టు అధికారులు



గురజాల: నగర పంచాయతిలోని లక్ష్మీటాకీసు సెంటర్‌లో గల ఒడ్డుల వాగులో కొద్ది రోజుల కిందట మొసలి కలకలం రేపిన సంఘటన పాఠకులకు విదితమే. మొసలి రాత్రి సమయాల్లో బయటకు వస్తున్న విషయాన్ని స్థానికులు గమనించారు. శనివారం తెల్లవారుజామున మూడు గంటల సమయంలో మొసలి ఒడ్డుకు రావడాన్ని గమనించిన స్థానికులు ఫారెస్టు అధికారులకు సమాచారం అందించారు. తెల్లవారుజామున దైద ఫారెస్టు బీట్ ఆఫీసర్ బి నాగేశ్వరరావు తన సిబ్బందితో కలసి వచ్చి మొసలిని అదుపులోకి తీసుకుని పొందుగుల కృష్ణానదిలో వదిలిపెట్టారు. చెరువులో మరొక మొసలి కూడా ఉన్నట్లు స్థానికులు చెబుతున్నారు. ఈ కార్యక్రమంలో ఫారెస్టు స్ట్రైకింగ్ ఫోర్సు సిబ్బంది పాల్గొన్నారు.

డీఐఓ ఆకస్మిక తనిఖీ



కారెంపూడి: కారెంపూడి ఇందిరానగర్ కాలనీలోని ఆరోగ్య ఉప కేంద్రంలో జరుగుతున్న వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి(డీఐఓ) డాక్టర్ పి గీతాంజలి శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. గర్భిణులు, చిన్నారులకు వేస్తున్న టీకాల వివరాలు ఎంసీపీ రిజిస్టర్‌లో నమోదు చేస్తున్నారా లేదా అనే విషయాన్ని పరిశీలించారు. మాతా శిశు సంరక్షణ రిజిస్టర్‌ను పరిశీలించారు. జిల్లా కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ కె వెంకటేశ్వర్లు, కారెంపూడి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఎం.రమ్య, డాక్టర్ కె.లక్ష్మీమౌనిక, సీహెచ్‌ఓ మల్లయ్య, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పి.పిసమ్మ, బి.విమల, బి.రాజేశ్వరి, కె.రాజేశ్వరి, ఎ.ధనలక్ష్మి పాల్గొన్నారు.

ఏపీఆర్ డిగ్రీ కళాశాలలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

విజయపురిసౌత్: స్థానిక ఏపీఆర్ డిగ్రీ కళాశాల (బాలుర)లో మొదటి సంవత్సరంలో చేరేందుకు ఏపీఆర్‌డీసీ సెట్–2004 ప్రవేశ పరీక్షకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపల్ వైఎస్ఎస్ చౌదరి శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆన్‌లైన్‌లో ఈనెల 31వ తేదికల్లా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 25న మధ్యాహ్నం 2.30 నుంచి 5గంటల వరకు జరుగుతుందన్నారు. ఈ పరీక్ష 26 జిల్లా కేంద్రాల్లో జరుగుతుందన్నారు.

కల్యాణం.. కమనీయం

- దేవరంపాడులో వేడుకగా మహోత్సవం
- గోవిందనామస్మరణతో మారుమోగిన ఆలయం



రాజుపాలెం: దేవరంపాడు కొండపై మత్స్య రూపంలో వెలసిన వేంకటేశ్వరుడి తిరునాళ్ల శనివారం వైభవంగా జరిగింది. స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని వేద పండితులు వేద మంత్రోచ్ఛరణల మధ్య కనుల పండువగా నిర్వహించారు. కల్యాణ మహోత్సవానికి రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు హాజరై మొక్కులు తీర్చుకున్నారు. ముందుగా రాష్ట్ర మంత్రి అంబటి స్వామివారికి పట్టు వస్త్రాలను, తలంబ్రాలను తీసుకురాగా వేద పండితులు పూర్ణకుంభంతో మంత్రోచ్ఛరణ, బ్యాండ్ వాయిద్యాలతో కల్యాణ వేదిక వద్దకు తీసుకెళ్లారు. సమీప ప్రాంతాల నుంచే గాక, సుదూర ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు దేవరంపాడు కొండకు విచ్చేసి స్వామి వారిని దర్శనం చేసుకొని మొక్కులు తీర్చుకున్నారు. గోవింద నామ స్మరణతో కొండ మారుమ్రోగింది. భక్తులు స్వామివారికి పొంగళ్లు చేసి, నెయ్యి, బెల్లం, పప్పు వగైరాలు సమర్పించారు. పశు సంపదను కాపాడాలని స్వామివారికి నెయ్యిని సమర్పించి మొక్కుకున్నారు. కల్యాణం అనంతరం స్వామివారిని పల్లకీలో ఊరేగించారు. వారి వెంట మండల కన్వీనర్ వేపూరి శ్రీనివాసరావు, దేవస్థాన కమిటీ చైర్మన్ శాఖమూరి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యురాలు దొంతిరెడ్డి సునీత, నాయకులు శ్రీనివాసరెడ్డి, సర్పంచ్ పత్తిపాటి దీనమ్మ కోటేశ్వరరావు, ఈఓ గుర్రం శ్రీనివాసరెడ్డి తదితరులు ఉన్నారు. అనంతరం అన్న సంతర్పణ కార్యక్రమం నిర్వహించారు.

రారండోయ్.. శింగరకొండ తిరునాళ్లకు

- ధ్వజారోహణంతో ఉత్సవాలు ప్రారంభం
- 25న ప్రధాన తిరునాళ్ల
- రెండు లక్షలకు పైగా భక్తులు వస్తారని అంచనా
- ఆకట్టుకోనున్న విద్యుత్ ప్రభలు
- పోలీసుల భారీ బందోబస్తు



శింగరకొండ క్షేత్రం వ్యూ

అద్దంకి: రాష్ట్రంలో ప్రసిద్ధిగాంచిన శింగరకొండ తిరనాళ్లు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. అద్దంకి–నార్కెట్‌పల్లి రాష్ట్రీయ రహదారికి ఆనుకుని శింగరకొండపాలెం గ్రామ సమీపంలోని భవనాశి చెరువు పక్కనే స్వయంభువుగా వెలసిన శింగరకొండ ప్రసన్నాంజనేయ స్వామి క్షేత్రం 69వ వార్షిక తిరుణాళ్లకు ముస్తాబైంది. శనివారం ధ్వజారోహణతో శింగరకొండ తిరునాళ్లకు అంకురార్పణ జరిగింది. ఈ తిరునాళ్లకు రాష్ట్రంలోని నలుమూలల నుంచి సుమారు రెండు లక్షల మందికిపైగా భక్తులు హాజరవుతారని అధికారులు అంచనా వేస్తున్నారు. పరిసర గ్రామాల ప్రజలు ఏర్పాటు చేయనున్న విద్యుత్ ప్రభలు, సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకోనునున్నాయి. ఆలయ రాజగోపురాలు, క్షేత్ర పరిసరాలు దేదీప్యమానంగా వెలిగిపోతున్నాయి. సుమారు 800 మంది పోలీసులు ఉత్సవంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా పటిష్ట బందోబస్తు నిర్వహించనున్నారు.

కోరిన కోర్కెలు తీర్చే కొంగుబంగారం..

క్షేత్రంలో పూర్వం కొండపైన లక్ష్మీనరసింహస్వామి ఉత్సవాలు జరుగుతుండగా.. కొండకు దిగువ భాగంలో చిల్లచెట్ల మధ్య ఒక దివ్యమైన వెలుగు భక్తులకు కనిపించింది. కొందరు ఆదే సమయంలో కిందకు వచ్చి చూడగా అక్కడ ప్రసన్నాంజనేయస్వామి విగ్రహం దర్శనమిచ్చింది. స్వామికి మొదట్లో పశువుల కాపరులు తమ గొర్రెలు, పశువులు చల్లగా ఉండాలని మొక్కుకునేవారు. వారి కోర్కెలు స్వామి తీర్చేవారు. తమ కోరిక తీరగానే పశువులను, గొర్రెలను స్వామి విగ్రహం చుట్టూ తిప్పి, పొంగలి పెట్టుకుని మొక్కులు తీర్చుకునే వారు. కోరిన కోర్కెలు తీర్చే స్వామిగా ఆ నోట, ఈ నోట విన్న పరిసర గ్రామాల భక్తులు ఇక్కడకు రావడం మొదలు పెట్టారు. వారి కోర్కెలు కూడా నెరవేరడంతో తొలుత పశువుల కాపరులు వేసిన పందిరి..చిన్న గుడిగా నిర్మితమైంది. అనంతరం శాశ్వత దేవస్థానం ఏర్పడి.. ఆదాయం బాగా వస్తుండటంతో దేవదాయశాఖ పరిధిలోకి చేరింది.

ముస్తాబైన సపరివార దేవతల ఆలయాలు

తిరునాళ్లలో భాగంగా క్షేత్ర పరిసరాల్లో ఉన్న శ్రీరామ నామ సంకీర్తన మందిరం, విద్యుల్లత షిర్డిసాయి ఆలయం, గణపతి, సుబ్రహ్మణ్య స్వామి, బ్రహ్మంగారి, గాయత్రి మాత, పోలేరమ్మ దేవస్థానాలను సర్వాంగ సుందరంగా అలంకరించారు.

లడ్డూ, పులిహోర ప్రసాదాలు రెడీ

దేవస్థాన ఆధ్వర్యంలో తిరునాళ్లకు వచ్చే భక్తులకు అందించేందుకు లడ్డూ, పులిహోర ప్రసాదానాలు సిద్ధం చేసినట్లు ఆలయ ఏసీ రఘునాథరెడ్డి తెలిపారు. స్వామివారి దర్శనం చేసుకున్న భక్తులకు ఉచిత ప్రసాదం అందించనున్నారు. క్షేత్రంలో అన్ని సామాజిక వర్గాల వారికి సంబంధించిన సత్రాలు ఉన్నాయి. ఆయా సత్రాల్లో ప్రధాన తిరునాళ్ల రోజు ఉదయం నుంచి మరుసటి రోజు తెల్లవారే వరకు అన్నదానం చేస్తూనే ఉంటారు.

ప్రత్యేక దర్శనం..

దేవస్థానంలో ఉచిత దర్శనంతో పాటు ప్రత్యేక దర్శనం, విభిన్న ప్రతిభావంతులకు ప్రత్యేక క్యూ లైన్లు ఏర్పాటు చేశారు. క్షేత్రాధిపతి నరసింహస్వామి దేవస్థానానికి వెళ్లడానికి రెండు ఉచిత బస్సులు దాతల సహకరంతో ఏర్పాటు చేయనున్నారు. పరిసరాల్లో జెయింట్ వీల్, వివిధ రకాలైన ఆట బొమ్మల దుకాణాలు ఏర్పాటు చేస్తున్నారు.



శింగరకొండకు మధ్య ఉన్న ట్రయాంగిల్ స్థలంలో 99 అడుగుల అభయాంజనేయస్వామి విగ్రహం ఉంది. ఈ విగ్రహం రాష్ట్రంలోని ఎత్తైన ఆంజనేయ స్వామి విగ్రహాల్లో రెండోది.

త'స్మార్ట్'.. శృతిమించొద్దు!

- సామాజిక మాధ్యమాల్లో ఎన్నికల ప్రచారంపై ఆంక్షలు
- మీడియా సర్టిఫికేషన్ మానిటరింగ్ కమిటీ అనుమతి తప్పనిసరి
- శృతిమించిన, అసత్య ప్రచారాలపై కేసులు నమోదు
- నేరం రుజువైతే పదేళ్ల జైలు, రూ.2లక్షల జరిమానా
- వివాదాస్పద పోస్టులు చేసినా, పార్వర్డ్ చేసినా బాధ్యులే
- మార్గదర్శకాలు నిర్దేశించిన కేంద్ర ఎన్నికల సంఘం



కొరిటెపాడు(గుంటూరు): సార్వత్రిక ఎన్నికల సందడి మొదలైంది. ఆయా పార్టీల నేతలు ప్రత్యక్షంగా ఓటర్లను కలవడంతో పాటు సామాజిక మాధ్యమాల(వాట్సాప్, ఫేస్‌బుక్, ట్విట్టర్, యూ ట్యూబ్, ఇన్‌స్టాగాం) ద్వారా ప్రచారాన్ని హోరెత్తిస్తున్నారు. అయితే సోషల్ మీడియాలో శృతిమించిన, అసత్య ప్రచారం చేపడితే పోలీసు కేసులు నమోదు చేయడంతో పాటు.. జైలు శిక్షలు పడే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో కేంద్ర ఎన్నికల సంఘం సోషల్ మీడియాకు కూడా ఎలక్ట్రానిక్ మీడియాకు మాదిరిగానే ఎన్నికల నిబంధనలు వర్తింపజేస్తోంది.

'సోషల్' ప్రచారం..పెయిడ్ న్యూస్ కిందకే..

సామాజిక మాధ్యమాల్లో ఎన్నికల ప్రచారం చేస్తే.. ఆయా పార్టీలు, అభ్యర్థులు వెచ్చిస్తున్న ఖర్చు వివరాల నివేదికను ఎన్నికల సంఘానికి అందజేయాల్సి ఉంటుంది. సోషల్ మీడియాలో ప్రచారం కూడా పెయిడ్ న్యూస్ కిందకే వస్తుంది. దీంతో ఈ ఖర్చు అభ్యర్థి ఎన్నికల ఖాతాలోకి వెళ్తుంది.

ఫార్వర్డ్ చేసినా నేరమే..

ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా తమ వాట్సాప్, ఫేస్‌బుక్ వేదికల్లో పోస్టింగ్ చేసినా, సందేశాలను పార్వర్డ్ చేసిన వారిపై కూడా చర్యలు ఉంటాయి.

గ్రూప్ అడ్మిన్ బాధ్యతలివే..

సోషల్ మీడియాలో గ్రూప్ సభ్యులు అభ్యంతరకరమైనా.. వివాదాస్పద పోస్టులు, కామెంట్స్ పెట్టినా వెంటనే వాటిని అడ్మిన్ డిలీట్ చేయాలి. లేదంటే పోస్టింగ్ చేసిన సభ్యుడితో పాటు గ్రూపు అడ్మిన్ బాధ్యత వహించాల్సి ఉంటుంది. ప్రస్తుత ఎన్నికల నిబంధనల మేరకు.. పోలింగ్‌కు 48 గంటల ముందే సోషల్ మీడియాలో ఎన్నికల ప్రచారాన్ని నిలిపివేయాలి.

అధికారుల నిరంతర నిఘా

సోషల్ మీడియాపై అన్ని శాఖల అధికారులు నిఘా ఉంచుతారు. ఫొటో మార్ఫింగ్, అశ్లీల చిత్రాలు పంచుకోవడం, ఇతరుల మనోభావాలు దెబ్బతినే విధంగా ఫొటోలు, సందేశాలు ఉంటే వాటిని ఐటీ యాక్ట్–2000 కిందుకు తీసుకొచ్చి.. సెక్షన్–67 కింద జైలు శిక్షతో పాటు జరిమానా విధించే అవకాశం ఉంది. నేరం రుజువైతే పదేళ్ల వరకు జైలు శిక్షతో పాటు రూ.2 లక్షల జరిమానా విధిస్తారు.

సోషల్ మీడియా.. మార్గదర్శకాలు ఇవే

- సామాజిక మాధ్యమాల్లో వ్యక్తిగతంగా, పార్టీలపై, సంస్థలు, అధికార యంత్రాంగంపై అసత్య ప్రచారం చేయకూడదు. పోటీ చేసే అభ్యర్థులపై కార్టూన్స్, మీమ్స్, షార్ట్ వీడియోల ద్వారా అసత్య ప్రచారం చేసినట్లు ఎవరైనా తగిన ఆధారాలతో ఫిర్యాదు చేస్తే.. వెంటనే పోలీసులు, ఎన్నికల అధికారులు కేసులు నమోదు చేసే అవకాశం ఉంది.
- చట్ట విరుద్ధమైన ప్రకటనలతో, రాజ్యాంగ ఉల్లంఘన, ఎన్నికల కోడ్‌కు వ్యతిరేకంగా ప్రచారం చేయొద్దు.
- అసత్య ప్రచారం చేస్తే ఐపీసీ–504, 505 సెక్షన్ల కింద కేసులు నమోదు చేసే అవకాశం ఉంది.
- సోషల్ మీడియాలో ఎన్నికల ప్రచార ప్రకటనలకు ముందు.. జిల్లా, రాష్ట్ర స్థాయిలోని మీడియా సర్టిఫికేషన్ మానిటరింగ్ కమిటీ అనుమతి పొందాల్సి ఉంటుంది.

'కోడ్' అమలులో 'పచ్చ'పాతమేలా..



కొమ్మినేనివారిపాలెంలో టీడీపీ పచ్చ బల్లలు, ప్రజాగళం పోస్టర్లు



కాంగ్రెస్ వాల్‌పోస్టర్లు

బల్లికురవ: ఎన్నికల కోడ్ తెలుగుదేశం, కాంగ్రెస్ పార్టీలకు వర్తించదా అని ప్రజలు చర్చించుకుంటున్నారు. మండలంలోని కొమ్మినేనివారి పాలెం గ్రామంలో ప్రయాణికులు కూర్చునే బల్లలపై పచ్చ రంగుతో పాటు ఎమ్మెల్యే రవికుమార్ పేరు ఉన్నా తొలగించలేదు. పేరు కనిపించకుండా కనీసం స్టిక్కర్ కూడా అంటించలేదు. ఈ నెల 17న చిలకలూరిపేట సమీపంలోని బొప్పూడిలో జరిగిన ప్రజాగళం వాల్ పోస్టర్లు దర్శనమిస్తున్నా అధికారులు చూసిచూడనట్లుగా వ్యవహరిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో అద్దంకి ఇన్‌చార్జి అడుసుమల్లి కిషోర్‌బాబు ప్రత్యేక హోదాపై యుద్ధం పేరిట గ్రామంలో వాల్ పోస్టర్లు ఉన్నాయి. ఇవి కూడా తొలగించలేదు. కొప్పరపాడు గ్రామంలోని శివాలయం, బస్టాప్ సమీపంలో టీడీపీ జెండా కడ్డీలు అలానే ఉంచారు. అదే గ్రామంలోని ఎస్సీ కాలనీలో వైఎస్సార్ విగ్రహం ముందున్న వైఎస్సార్ సీపీ జెండాను, కడ్డీను పూర్తిగా తొలగించారు. ఇలా..ఒక పార్టీవే తొలగించడమేమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఎన్నికల కోడ్ వచ్చి పదిరోజులు కావొస్తున్నా.. అధికారులు పూర్తిస్థాయిలో కోడ్ పాటించటం లేదని ప్రజలు వాపోతున్నారు.

ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే వేటు

జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్

బాపట్లటౌన్: ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం వహించిన సిబ్బందిపై వేటు తప్పదని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ హెచ్చరించారు. ఎస్పీ క్యాంప్ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల ప్రవర్తన నియమావళిని దృష్టిలో ఉంచుకొని ప్రతి ఒక్కరూ క్రమశిక్షణతో విధులు నిర్వహించాలన్నారు. ఎన్నికల నియమావళిని ఉల్లంఘించిన పోలీసులను ఉపేక్షించబోమని, వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లాలో ఉన్న ప్రతి పోలీస్ అధికారి, సిబ్బంది ఎన్నికల సంఘం నియమావళికి లోబడి విధులు నిర్వహించాలన్నారు. సంతమాగులూరు సర్కిల్ పరిధిలోని బల్లికురవ ఎస్ఐ పి.నాగ శివారెడ్డి కిరాణాషాపులోని వ్యక్తిపట్ల దురుసుగా ప్రవర్తించాడంటూ వచ్చిన ఆరోపణలపై ఇప్పటికే శాఖాపరమైన చర్యలు తీసుకున్నామని తెలిపారు. పూర్తి స్థాయిలో దర్యాప్తు చేస్తున్నామని, తప్పు రుజువు అయితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ స్పష్టం చేశారు. అదేవిధంగా రాజకీయ నాయకులు వచ్చి సదరు ఎస్ఐకు శాలువాను కప్పినట్లు వచ్చిన ఆరోపణలపై కూడా విచారణ జరుపుతున్నామన్నారు. ఇప్పటికే ఎస్ఐకి షోకాజ్ నోటీసులు జారీ చేయడం జరిగిందన్నారు. బాపట్ల డీఎస్పీ సీహెచ్ మురళీకృష్ణ ప్రత్యేక దర్యాప్తు అధికారిగా నియమించి విచారణ చేపట్టామన్నారు.

ఉపాధిహామీ పనుల్లో నాణ్యత తప్పనిసరి

పంచాయతీరాజ్ కమిషనర్ కన్నబాబు

యద్దనపూడి: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులను నాణ్యతతో నిర్వహించాలని పంచాయతీరాజ్ కమిషనర్ కన్నబాబు పేర్కొన్నారు. శనివారం మండలంలోని చిలుకూరివారిపాలెం గ్రామంలో జరుగుతున్న ఉపాధిహామీ పనులను స్పెషల్ కమిషనర్ సిరితో కలిసి పరిశీలించారు. స్థానిక వేతనదారులతో మట్లాడి ఇప్పటి వరకు జరిగిన పనులపై ఆరా తీశారు. ఆదాయం, పనిదినాలు, ఉపాధి సిబ్బందికి సమకూర్చిన సౌకర్యాల గురించి ప్రశ్నించారు. స్పెషల్ కమిషనర్ సిరి మండలంలోని జాగర్లమూడి, యద్దనపూడి, గన్నవరం, వింజనంపాడులో జరుగుతున్న స్వామిత్ర సర్వే వివరాలను రెవెన్యూ అధికారులు, పంచాయతీ కార్యదర్శులను అడిగి తెలుసుకున్నారు. డీపీఓ రవికుమార్, ఎంపీడీఓ శివసుబ్రహ్మణ్యం, ఈఓపీఆర్డీ శ్రీనివాసరావు, ఆర్ఐ విష్ణు, ఏపీఓ రమేష్ పాల్గొన్నారు.

చీరాల చేనేతలతో టీడీపీ కుర్చీలాట

- అర డజను నేతలకు సీటు ఇస్తామని హామీ..
- చివరకు హ్యాండిచ్చారంటూ ఆశావహుల ఆగ్రహం
- చేనేతలను దూషించిన కొండయ్యతో కొనసాగలేం
- 70 వేల ఓట్లున్న తమకు మొండి చేయి చూపడం అన్యాయం
- చంద్రబాబు వద్దే అమీతుమీ తేల్చుకుంటాం
- మీడియా సమావేశంలో హెచ్చరించిన టీడీపీ చేనేతలు'



మాట్లాడుతున్న డాక్టర్ సజ్జా హేమలత, చేనేత నాయకులు

చీరాల: తెలుగుదేశం పార్టీ అభ్యర్థుల విషయంలో రోజురోజుకూ ఆశావహుల నుంచి విమర్శలు ఎదుర్కొంటోంది. చీరాల అసెంబ్లీ అభ్యర్థిగా ఎం.ఎం కొండయ్యను టీడీపీ అదిష్టానం ప్రకటించింది. ఆయన ప్రచారం కూడా మొదలుపెట్టారు. అయితే చేనేతలకు చీరాల సీటును తప్పకుండా కేటాయిస్తామని నారా లోకేష్ హామీ ఇవ్వడంతో..అర డజనుకుపైగా ఆశావహులు చినబాబును, పెదబాబును కలిశారు. తమను కలసిన వారందరికీ చీరాలకు వెళ్లి పనిచేసుకోవాలని అధినేతలు సూచించారు. దీంతో చీరాల కేంద్రంగా ఇళ్లు అద్దెకు తీసుకుని కొందరు, స్థానికులు కొందరు నియోజకవర్గంలో పర్యటనలు కూడా చేశారు. ఆశావహులంతా ఎంతోకొంత డబ్బు ఖర్చుపెట్టుకున్నారు. సీటు మీకే ఇప్పిస్తామని చెప్పి, నమ్మబలికిన వారికి కూడా పెద్ద మొత్తంలో సమర్పించుకున్న ఘటనలు ఉన్నాయి. వీరిలో డాక్టర్ సజ్జా హేమలత, మునగపాటి బాబు, సజ్జా చంద్రమౌళి, తిరువీధుల శ్రీనివాసరావు, కాండ్రు శ్రీనివాసరావు మరికొందరు ఉన్నారు. అయితే వీరందరిని కాదని పార్టీ అదిష్టానం యాదవ సామాజిక వర్గానికి చెందిన మద్దులూరి మాలకొండయ్యకు కేటాయించింది. దీంతో సీటు కోసం విడివిడిగా ప్రయత్నాలు చేసిన చేనేత ఆశావహులు అంతా ఒక్కటయ్యారు.

ధూషించిన కొండయ్యతో పనిచేసేది లేదు..

టీడీపీ సీటు దక్కించుకున్న కొండయ్య చేనేత ఆశావహులను బహిరంగంగానే నోటికి వచ్చినట్లు బండ బూతులు తిట్టారని డాక్టర్ సజ్జా హేమలత ఆగ్రహించారు. చేనేతలను చిన్నచూపు చూసి, తమను అవమానించిన కొండయ్యతో కలసి పనిచేయలేమని ఆమె తేల్చేశారు. ఈ మేరకు మీడియా సమావేశంలో ఆవేదన వ్యక్తం చేశారు. భవిష్యత్ కార్యచరణపై చేనేతలతో చర్చించి సరైన నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. చీరాల నియోజకవర్గంలో 70 వేల ఓట్లు చేనేతలవి ఉన్నాయని, వారందరినీ ఏకం చేస్తామన్నారు. తమకు సీటు ఇస్తామని చివరి వరకు నమ్మించి చేనేతలకు హ్యాండిచ్చారని మండిపడ్డారు. రాష్ట్ర వ్యాప్తంగా చేనేతలను కలపుకుని చీరాల సీటు తమలో ఎవరికైనా ఒకరికి ఇవ్వాలని పట్టుపడతామని.. లేకుంటే.. రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేస్తామని చెప్పారు. రాష్ట్రంలో 42 లక్షల మంది చేనేతలున్నారని.. తమకు ఒక్క నియోజకవర్గం కూడా టీడీపీ కేటాయించకపోవడం చాలా అన్యాయం, దుర్మార్గమని ఆగ్రహం వ్యక్తం చేశారు.

గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలి

అద్దంకి వైఎస్సార్ సీపీ అభ్యర్థి చిన హనిమిరెడ్డి

జే.పంగులూరు: రాబోయే ఎన్నికల్లో నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని అద్దంకి వైఎస్సార్ సీపీ అభ్యర్థి పానెం చిన హనిమిరెడ్డి పిలుపునిచ్చారు. మండల పరిధిలోని రేణింగవరం పార్టీ కార్యాలయంలో శనివారం కార్యకర్తలు, నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో హనిమిరెడ్డి మాట్లాడారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో జరిగిన మంచిని ప్రజలకు తెలియజేయాలన్నారు. గ్రామాల్లో ప్రతి ఒక్కరూ స్టార్ క్యాంపెయినర్లుగా ముందుకు సాగాలన్నారు. నాయకులు, కార్యకర్తలు అందరూ కలసి కట్టుగా పనిచేయాలని సూచించారు. అన్ని గ్రామాల్లో వైఎస్సార్ సీపీకి ప్రజాదరణ మెండుగా ఉందన్నారు. జగనన్న చేసిన మేలే ప్రజల్లో ఉందన్నారు. అద్దంకిలో వైఎస్సార్ సీపీ అత్యధిక ఓట్ల మెజార్టీతో గెలవడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. పార్టీ గెలుపు కోసం కష్టపడి పనిచేసిన ప్రతి ఒక్కరికీ సముచిత స్థానం ఉంటుందని హనిమిరెడ్డి భరోసానిచ్చారు. అనంతరం గ్రామాల వారీగా నాయకులు, కార్యకర్తలతో మాట్లాడారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ స్వయంపు హనుమంతురావు, మాజీ ఏఎంసీ చైర్మన్ పులికం కోటిరెడ్డి, మండల పార్టీ ఇన్‌చార్జ్ బిజ్జం శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర వడ్డి రాజుల సంఘం కార్పొరేషన్ డైరెక్టర్ పల్లపు రాము, రాష్ట్ర ఎస్సీ సెల్ అధ్యక్షుడు రాజ్‌కుమార్, మండల కన్వీనర్ సందిపోగు బుజ్జి, మండల బీసీ సెల్ కన్వీనర్ చక్రవరం భాస్కర్‌రాజు, రైతు సంఘం నాయకులు రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



పార్టీలో చేరిన వారితో వైఎస్సార్ సీపీ అభ్యర్థి చిన హనిమిరెడ్డి

టీడీపీని వీడి వైఎస్సార్ సీపీలో చేరిక..

అద్దంకి రూరల్: జగనన్న ప్రజారంజక పాలన పట్ల ఆకర్షితులై టీడీపీని వీడి అద్దంకి పట్టణం 14వ వార్డులోని 15 కుటుంబాల సభ్యులు శనివారం పానెం చిన హనిమిరెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీలో చేశారు. వీరందరికి ఆయన పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. రాబోయో ఎన్నికల్లో అద్దంకిలో వైఎస్సార్ సీపీ జెండా ఎగురవేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు కాకాని రాధకృష్ణమూర్తి, పానెం నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

15 నుంచి సెల్‌ ఫోన్‌ సర్వీసెస్‌లో ఉచిత శిక్షణ

కొరిటెపాడు (గుంటూరు): యూనియన్‌ బ్యాంక్‌ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో ఏప్రిల్‌ 15వ తేదీ నుంచి సెల్‌ ఫోన్‌ రిపేర్‌, సర్వీసెస్‌లో ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు సంస్థ డైరెక్టర్‌ జి.బి.కుమార్‌ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణ కాలం 30 రోజులు ఉంటుందని, శిక్షణ సమయంలో ఉచిత భోజనంతో పాటు వసతి సౌకర్యం కల్పించ బడుతోందన్నారు. వయస్సు 19 నుంచి 45 సంవత్సరాల లోపు ఉండాలని సూచించారు. ఆసక్తి గల అభ్యర్థులు తెల్లరేషన్‌ కార్డు, ఆధార్‌ కార్డు జిరాక్స్‌ కాపీలు, నాలుగు పాస్‌పోర్టు సైజ్‌ ఫోటోలు, 10వ తరగతి పాస్‌ లేదా ఫెయిల్‌ జిరాక్స్‌ కాపీలతో ముందుగా పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు యూనియన్‌ బ్యాంక్‌ ఆఫ్‌ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ, ఓల్డ్‌ బ్యాంక్‌ వీధి, కొత్తపేట, గుంటూరు, 0863–2336912, 9700687696, 8125397953, 9949930155 ఫోన్‌ నెంబర్లను సంప్రదించాలని ఆయన తెలియజేశారు.

గురుకుల ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

తాడికొండ: రాష్ట్రంలోని ఏపీ గురుకుల విద్యాలయాల్లో 2024–25 విద్యా సంవత్సరానికి గాను 5వ తరగతిలో అన్ని సీట్లలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తాడికొండ ఏపీ గురుకుల పాఠశాల (సెంటర్‌ ఆఫ్‌ ఎక్సలెన్సీ) ప్రిన్సిపల్‌ పి.జోగారావు తెలిపారు. 5వ తరగతిలో చేరేందుకు అన్ని సీట్లలో, 6,7,8 తరగతులలో ఖాళీగా ఉన్న సీట్ల ప్రవేశానికి దరఖాస్తు చేసుకొని ప్రవేశ పరీక్షలో పాల్గొనాలని సూచించారు. ప్రవేశ పరీక్ష దరఖాస్తులను మార్చి 01వ తేదీ నుంచి మార్చి 31వ తేదీ వరకు ఏపీఆర్‌ఎస్‌ డాట్‌ ఏపీసీఎఫ్‌ఎస్‌ఎస్‌ డాట్‌ ఇన్‌ వెబ్‌సైట్‌ ద్వారా మాత్రమే సమర్పించాలని సూచించారు. అర్హులైన విద్యార్థులు ఆన్‌లైన్‌ ద్వారా మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని, ఏప్రిల్‌ 25వ తేదీన అన్ని జిల్లా ప్రధాన కేంద్రాలలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు. మైనార్టీ పాఠశాలల్లో చేరగోరు విద్యార్థులకు ప్రవేశ పరీక్ష లేకుండా నేరుగా ప్రవేశం కల్పించడం జరుగుతుంది కనుక.. అర్హులైన విద్యార్థులు ఈ సదావకాశాన్ని ఉపయోగించుకోవాలని సూచించారు.

మైనార్టీ బాలికల పాఠశాలలో ప్రవేశాలు

గుంటూరు ఎడ్యుకేషన్‌: సంగడిగుంటలోని ఏపీ మైనార్టీ బాలికల పాఠశాలలో 5,6,7,8 తరగతుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్‌ ఎ. బాలాశ్రీ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. 5వ తరగతిలో ఎస్సీ, ఎస్టీ ఖాళీలతో పాటు 6,7,8 తరగతుల్లో మిగిలిన ఖాళీలను భర్తీ చేస్తామని, నేరుగా పాఠశాలతో పాటు 87126 25039 నంబర్లో సంప్రదించాలని సూచించారు.

‘ఆడుదాం ఆంధ్రా’ టు ప్రో కబడ్డీ జట్టుకు..

- రాణించిన చినగంజాంకు చెందిన బాలకృష్ణారెడ్డి
- ప్రతిభను గుర్తించి ప్రభుత్వం రూ.10 లక్షలు ప్రోత్సాహం


సీఎం వైఎస్‌ జగన్‌ నుంచి యువ టాలెంట్‌ క్రీడాకారుడిగా కప్‌ అందుకుంటున్న బాలకృష్ణారెడ్డి(ఫైల్‌)

చినగంజాం: ఆడుదాం ఆంధ్రా ఆ యువకుడి జీవితాన్ని మలుపుతిప్పింది. శ్రమకు తగిన ఫలితం లభించింది. ఎన్నో ఏళ్ల కల ఫలించింది. గ్రామీణ ప్రాంతంలో ప్రతిభ కలిగిన యువ క్రీడాకారులను వెలికి తీసేందుకు సీఎం వైఎస్‌ జగన్‌ మోహన్‌రెడ్డి చేపట్టిన ‘ఆడుదాం ఆంధ్రా’ కార్యక్రమం రాణించి ప్రో కబడ్డీ జట్టులో చినగంజాంకు చెందిన పిట్టు బాలకృష్ణారెడ్డి స్థానం సాధించాడు.

వివరాలు.. గత ఫిబ్రవరిలో రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన ఆడుదాం–ఆంధ్రా పోటీల్లో చినగంజాం మండలానికి చెందిన కబడ్డీ జట్టు విజేతగా నిలిచి కప్‌ కైవసం చేసుకుంది. సీఎం వైఎస్‌ జగన్‌ స్వయంగా జట్టుకు కప్‌ను అందజేసి ప్రశంసలు అందజేశాడు. జట్టులో చినగంజాంకు చెందిన యువకుడు పిట్టు బాలకృష్ణారెడ్డి అత్యుత్తమ ప్రతిభను కనబరచి ప్రో కబడ్డీ జట్టుకు ఎంపికయ్యాడు. ప్రతిభ కలిగిన యువ క్రీడాకారులను గుర్తించే కార్యక్రమంలో భాగంగా నలుగురు క్రీడాకారులను ఎంపిక చేయగా వారిలో పిటుట్‌ బాలకృష్ణారెడ్డి ఒకరు. అతడికి ప్రోత్సాహకంగా రూ.10 లక్షలు నగదు అందజేస్తామని, బాలకృష్ణారెడ్డి ప్రో కబడ్డీకి ఎంపిక చేస్తున్నట్లుగా ముఖ్యమంత్రి స్వయంగా ప్రకటించారు.

పేద కుటుంబం నుంచి..

మండలంలోని కొత్తపాలెం గ్రామ పంచాయతీ పరిధిలోని మూలగానివారిపాలేనికి చెందిన పిట్టు కృష్ణారెడ్డి, మహాలక్ష్మి దంపతులు పెళ్లిళ్లలో వంటలు చేసి కుటుంబాన్ని పోషించుకునేవారు. వీరికి ముగ్గురు సంతానం. పెద్ద కుమార్తెకు వివాహం చేశారు. రెండో కుమారుడు డిగ్రీ చదువుతున్నాడు. మూడో కుమారుడు పిట్టు బాలకృష్ణారెడ్డి ప్రస్తుత డిగ్రీ చదువుతున్నాడు.

చినగంజాం జెడ్పీ ఉన్నత పాఠశాలలో చదువుతూ కబడ్డీపై చిన్నతనం నుంచి ఆసక్తిని పెంచుకుని పాఠశాల స్థాయిలో పోటీలలో పాల్గొన్నాడు.

బాలకోటేశ్వర స్పోర్ట్స్‌ క్లబ్‌తో...

పాఠశాల స్థాయిలో కబడ్డీ ఆడే సమయంలో అంతర్జాతీయ క్రీడాకారుడు మరపాల గిరిబాబు అతడిలోని ప్రతిభను గుర్తించారు. బాలకోటేశ్వర స్పోర్ట్స్‌ క్లబ్‌లో కబడ్డీలో మెలకువలను నేర్చుకున్నాడు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన ఆడుదాం–ఆంధ్రా కొత్తపాలెం సచివాలయం కబడ్డీ జట్టులో ఒక క్రీడాకారుడిగా ఉండి నైపుణ్యం ప్రదర్శించి రాణించాడు. మండల, నియోజకవర్గం, జిల్లాస్థాయిలో నిర్వహించిన పోటీలలో జట్టుతో కలసి ఆడి జట్టు రాష్ట్ర స్థాయి పోటీలలో అర్హత సాధించేందుకు తన వంతు కృషి చేశాడు.

ప్రతిభతో బహుమతి..

విశాఖపట్టణంలో నిర్వహించిన కబడ్డీ ఫైనల్‌లో బాలకృష్ణారెడ్డి తన ప్రతిభను చూపి ఉన్నతాధికారుల దృష్టిని ఆకర్షించాడు. అతడి ప్రతిభను గుర్తించిన ప్రభుత్వం అతడిని ప్రో కబడ్డీ జట్టుకు ఎంపిక చేయడమే కాక ప్రోత్సాహకం బహుమతి అందజేసింది. అందులో భాగంగా ఇటీవల రాష్ట్ర క్రీడలు, పర్యాటకశాఖ మంత్రి ఆర్‌కే రోజా ప్రతిభ కనబరచిన యువ క్రీడాకారుడిగా పిట్టు బాలకృష్ణారెడ్డిని గుర్తించడంతో అతడికి రూ.10 లక్షలు చెక్‌ను అందజేసింది.

> **సీఎం అభినందించడం గర్వంగా ఉంది..**
>
> సీఎం వైఎస్‌ జగన్‌ మోహన్‌రెడ్డి మట్టిలో మాణిక్యాలను వెలికి తీసేందుకు ఆడుదాం – ఆంధ్రా క్రీడా పోటీలను నిర్వహించడం ఎంతో గొప్ప విషయం. పోటీలను గ్రామ సచివాలయ స్థాయి నుంచి నిర్వహించడం నాలాంటి ఎంతో మందికి ఉపయోగపడింది. నన్ను ఆయనే స్వయంగా అభినందించి, ప్రో కబడ్డీ జట్టుకు ఎంపిక చేయడం నా సంతోషానికి అవధులు లేవు.
>
> –పిట్టు బాలకృష్ణారెడ్డి, మూలగాని వారిపాలెం

క్రీడల్లోనూ ప్రావీణ్యం సంపాదించాలి

పార్టీ అసెంబ్లీ అభ్యర్థి కరణం వెంకటేష్‌



మాట్లాడుతున్న వైఎస్సార్‌ సీపీ అసెంబ్లీ అభ్యర్థి కరణం వెంకటేష్‌

చీరాల రూరల్‌: విద్యార్థులు, యువత చదువుతో పాటు క్రీడల్లోనూ ప్రావీణ్యం సాధించినప్పుడే ఉన్నత స్థానాలకు చేరుకుంటారని వైఎస్సార్‌ సీపీ అసెంబ్లీ అభ్యర్థి కరణం వెంకటేష్‌ పేర్కొన్నారు. స్థానిక మరియమ్మపేటలోని ఐఎల్‌టీడీ వండర్స్‌ క్రీడా మైదానంలో శనివారం ఎంసీసీ రెడ్‌ టెన్నిస్‌ క్రికెట్‌ పోటీలను శనివారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ చిన్ననాటి నుంచి చదువుతో పాటు క్రీడల్లో మక్కువ పెంచుకోవాలని సూచించారు. ఎంతోమంది క్రీడల్లో ప్రావీణ్యం పొంది ప్రభుత్వ కొలువులు చేస్తున్నారని చెప్పారు. క్రీడల వలన మనస్సుకు ప్రశాంతత దొరుకుతుందని, శరీరం కూడా మంచి ధృడత్వం పొందుతుందన్నారు. ముఖ్యంగా యువత చెడు మార్గాలను విసర్జించి సన్మార్గంలో పయనించటానికి క్రీడలు దోహదం చేస్తాయని చెప్పారు. ప్రభుత్వం ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో ఎందరో క్రీడాకారులను వెలుగులోకి తెచ్చిందని పేర్కొన్నారు. ప్రస్తుతం ఐపీఎల్‌ క్రికెట్‌ టోర్నీ జరుగుతుందని వాటిలో కూడా ఎంతోమంది క్రీడాకారులు తమ సత్తా చాటుతున్నారని చెప్పారు. ఐపీఎల్‌లో అత్యుత్తమంగా రాణించిన క్రీడాకారులను ఇండియన్‌ టీంలో చేర్చుకుంటున్నారని వెల్లడించారు. అనంతరం క్రికెట్‌ పోటీల నిర్వాహకులకు ఆయన అభినందించారు. కార్యక్రమంలో మున్సిపల్‌ వైస్‌ చైర్మన్‌ బొనిగల జైసన్‌బాబు, పార్టీ పట్టణ అధ్యక్షుడు కోండ్రు బాబ్జీ, కౌన్సిలర్లు గొట్టిపాటి ఎబినేజర్‌, సల్లూరి సత్యానందం, కలవకూరి యానాదిరావు, ట్రేడ్‌ యూనియన్‌ జిల్లా అధ్యక్షుడు సల్లూరి అనిల్‌, మామిడాల శ్రీనివాసరావు, చిలుకోటి శ్రీనివాసరావు, కోడూరి ప్రసాద్‌ రెడ్డి, తలకాయ సుధీర్‌, వాసిమళ్ల వాసు పాల్గొన్నారు.

వాహనాలు ఢీకొని ఇద్దరి మృతి

మంగళగిరి: నగర పరిధిలోని కాజ జాతీయ రహదారిపై శుక్రవారం గుర్తు తెలియని వాహనాలు ఢీకొని గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు మృతి చెందిన ఘటన చోటు చేసుకుంది. రూరల్‌ పోలీసులు తెలిపిన వివరాల మేరకు కాజ ఖలీల్‌ భాయ్‌ హోటల్‌ జాతీయ రహదారిపై గుర్తు తెలియని వ్యక్తి అర్ధరాత్రి రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో మృతి చెందాడు. అదే విధంగా నారాయణ తీర్థుల ఆలయం శుక్రవారం తెల్లవారు జామున గుర్తు తెలియని వ్యక్తి రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొనగా మృతి చెందినట్లు తెలిపారు. కాజ వీఆర్వో ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

లైంగిక దాడికి పాల్పడిన కానిస్టేబుల్‌ అరెస్ట్‌

క్రోసూరు: క్రోసూరు గ్రామానికి చెందిన యువతిపై శుక్రవారం లైగింక దాడికి పాల్పడిన సంఘటనలో నిందితుడైన పోలీసు కానిస్టేబుల్‌ ఎం.రవిబాబును శనివారం అరెస్ట్‌ చేసి కోర్టుకు హాజరుపరిచినట్లు ఎస్‌ఐ ఎం.షఫీ తెలిపారు. కిడ్నాప్‌, రేప్‌ సెక్షన్ల కింద అరెస్ట్‌ చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

ప్రతి పథకం మనల్ని గెలిపించేదే..

- మెజార్టీయే లక్ష్యంగా ఐక్యంగా పోరాడుదాం
- పార్టీ అసెంబ్లీ అభ్యర్థి యడం బాలాజీ


మాట్లాడుతున్న అసెంబ్లీ అభ్యర్థి బాలాజీ

మార్టూరు: రాష్ట్రంలో మన ప్రభుత్వం అమలు పరచిన సంక్షేమ పథకాలు పొందని గడప లేదని.. ఆ పథకాలు అమలు పరచిన సీఎం వైఎస్‌ జగన్‌ మోహన్‌రెడ్డి మీద ప్రజలకున్న అపార నమ్మకమే మనల్ని మరోసారి గెలిపించబోతోందని వైఎస్సార్‌ సీపీ పర్చూరు నియోజకవర్గ అభ్యర్థి యడం బాలాజీ అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో కార్యకర్తల సమావేశం శనివారం నిర్వహించారు. గత ఎన్నికలలో మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలతో భారీ మెజార్టీతో 151 సీట్లు గెలిచామని, అందులోని 90 శాతం హామీలను ప్రస్తుత ప్రభుత్వంలో నెరవేర్చాం కనుక అంతకంటే అత్యధిక మెజారిటీతో తిరిగి అధికారంలోకి రాబోతున్నామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. గ్రామస్థాయి నుంచి నాయకులు, కార్యకర్తలు ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తే మనదే గెలుపని బాలాజీ అన్నారు. అవినీతికి తావు లేకుండా పారదర్శకంగా పథకాలు పొందిన ప్రతి గడపకూ వెళ్లి ఓటు అడిగే అర్హత, అవకాశం మనకు మాత్రమే ఉందని వివరించారు.

కూటమితో ప్రయోజనాలు శూన్యం..

తమకు ఓటు వేసి గెలిపిస్తే ఏమి చేయగలమో చెప్పలేని మూడు పార్టీల కిచిడీ కూటమితో ప్రజలకు ఒరిగేది శూన్యమని యడం బాలాజీ ఎద్దేవా చేశారు. అసంబద్ధమైన పొత్తులను ప్రజలకు అవగాహన కల్పించాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఆదరించే ప్రతి కార్యకర్తకు అండగా ఉంటానని ఎన్నికల యుద్ధానికి అందరూ సన్నద్ధం కావాలని బాలాజీ పిలుపునిచ్చారు. మండలంలోని ప్రతి గ్రామాన్ని యూనిట్‌గా తీసుకుని ఆయా గ్రామాల నాయకులతో విడివిడిగా ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. స్థానిక సమస్యల గురించి మెరుగైన ఫలితాల కోసం అవసరమైన పరిష్కారాల గురించి చర్చించి వ్యూహ రచన చేశారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్‌ వైస్‌ చుండి సు/స్వామ్మ, మార్టూరు ఉప సర్పంచి కాకోలు రామారావు, మండల కన్వీనరు పఠాన్‌ కాలేషావలి, కోలా వెంకట్రావు, పెంటేల సత్యం, గర్నెపూడి రవిచంద్‌, బాబూ నాయక్‌, రాజానాయక్‌, తాటి వెంకట్రావు వినుకొండ సుధాకర్‌, గడ్డం మస్తాన్‌వలి, భాగ్యారావు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌ సీపీలోకి భారీగా చేరికలు


వైఎస్సార్‌ సీపీలో చేరిన భట్టిప్రోలుకు చెందిన పద్మశాలీలతో అశోక్‌బాబు

భట్టిప్రోలు: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌ రెడ్డి ప్రవేశపెట్టిన నవరత్నాలు, అభివృద్ధి పథకాలకు ఆకర్షితులైన భట్టిప్రోలుకు చెందిన పది పద్మశాలీ కుటుంబాలు వైఎస్సార్‌ సీపీలో చేరాయి. శనివారం అమృతలూరులోని పార్టీ కార్యాలయంలో పార్టీ వేమూరు నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు సమక్షంలో పార్టీలో చేరారు. వైఎస్సార్‌ సీపీ కండువాలు కప్పి వీరిని పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. అశోక్‌బాబు మాట్లాడుతూ పార్టీలో చేరిన వారికి సముచిత స్థానం కల్పిస్తామని భరోసా ఇచ్చారు. సీఎం జగన్‌ ఎన్నో విప్లవాత్మకమైన మార్పులను తీసుకువచ్చారని పేర్కొన్నారు. రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్‌ సీపీని గెలిపించుకుని మరొకసారి జగన్‌ను సీఎంని చేసుకుందామని పిలుపునిచ్చారు. పార్టీలకు అతీతంగా పట్టాల పంపిణీ చేసినట్లు చెప్పారు. ఎన్నికల అనంతరం మళ్లీ అర్హులైన పేదలకు పట్టాలు పంపిణీ చేస్తామని తెలిపారు. ప్రజలకు ఎంతో మంచి చేస్తున్న వైఎస్‌ జగన్‌ ప్రభుత్వంపై ఎల్లో మీడియా, పచ్చ పత్రికలు విషం చిమ్ముతున్నాయని... ఎటువంటి వదంతులు నమ్మవద్దని ప్రజలకు హితవు పలికారు. కార్యక్రమంలో వైఎస్సార్‌ సీపీ వివిధ విభాగాల నాయకులు బండారు శ్రీనివాసరావు, కుందేటి రమేష్‌, పడమటి శ్రీనివాసరావు, కుక్కల భూషణరావు, బండారు దిలీప్‌, ఉక్కడాల ఆనంద్‌ పాల్గొన్నారు.

తన్మయత్వం.. శ్రీవారి తిరు కల్యాణం


శ్రీవారి తిరుకల్యాణ మహోత్సవానికి హాజరైన భక్తులు

రేపల్లె రూరల్‌: పట్టణంలోని ఉప్పూడి రోడ్డులో వేంచేసియున్న శ్రీ లక్ష్మీ, గోదా సమేత వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు శనివారం మూడో రోజు ఘనంగా నిర్వహించారు. శ్రీవారి తిరు కల్యాణ మహోత్సవం కనుల పండువగా సాగింది. లక్ష్మీ, గోదా, వేంకటేశ్వరులను వధూవరులను చేసి, వేద మంత్రాలు, మంగళ వాయిద్యాల నడుమ ఆలయ అర్చక బృందం కల్యాణ ఘట్టాన్ని పూర్తిచేసింది. భక్తులు అధిక సంఖ్యలో తిరు కల్యాణాన్ని తిలకించి తరించిపోయారు. స్వామి వారికి మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేసి, అన్న సంతర్పణ చేశారు. ఉత్సవమూర్తులకు పుర వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. వేడుకలను ఆలయ సింగిల్‌ ట్రస్టీ గడ్డం రాధాకృష్ణమూర్తి, కోటేశ్వరమ్మ దంపతుల పర్యవేక్షించారు.